క్లుప్తంగా

నేడు ప్రముఖ వైద్య నిపుణుల రాక

ఉచిత షుగర్ పరీక్షలు

పులివెందుల : పట్టణంలోని స్థానిక భాకరాపురంలో ఉన్న దినేష్ మెడికల్ సెంటర్(గంగిరెడ్డి ఆసుపత్రి)లో ఆదివారం కర్నూలు విశ్వభారతి ఆసుపత్రి నుంచి ప్రముఖ గుండె జబ్బుల వైద్య నిపుణులు డాక్టర్ హితేష్‌రెడ్డి గుండె సంబంధిత జబ్బులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తారన్నారు. అలాగే ప్రముఖ క్యాన్సర్ వ్యాధి నిపుణురాలు డాక్టర్ నిహారిక క్యాన్సర్ అవగాహన, స్క్రీనింగ్, క్యాన్సర్ రోగులను క్రమం తప్పకుండా అనుసరించడం, ఇతర క్యాన్సర్ సంబంధిత సంప్రదింపులు అందుబాటులో ఉంటాయన్నారు. అలాగే ప్రముఖ షుగర్ స్పెషలిస్ట్ డాక్టర్ వై.జి.హర్షవర్ధన్‌రెడ్డి ఉచిత షుగర్ పరీక్షలు నిర్వహించి సలహాలు, సూచనలు ఇస్తారన్నారు. పరీక్ష చేయించుకోవాలనుకునే వారు పడగడుపున ఏమి తినకుండా రావాలన్నారు. ఆసుపత్రిలో నూతనంగా డయాలసిస్ సెంటర్‌ను ప్రారంభించడం జరిగిందని, కిడ్నీ సేవలు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటాయన్నారు. మరిన్ని వివరాలకు 08568 286189, 9963170177 అనే ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు.

పరామర్శ



రామలింగారెడ్డి తల్లి పార్వతమ్మను పరామర్శిస్తున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

వేముల : మండలంలోని నల్లగొండువారిపల్లెలో టీడీపీ నాయకుల దాడిలో తీవ్రంగా గాయపడిన వైఎస్సార్‌సీపీ నేత లింగాల రామలింగారెడ్డి కుటుంబాన్ని ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి శనివారం పరామర్శించారు. ఈనెల 6వ తేదీన పులివెందుల జెడ్పీటీసీ ఉప ఎన్నికల ప్రచారంలో భాగంగా లింగాల రామలింగారెడ్డిపై హత్యాయత్నం జరిగింది. దీంతో ఎంపీ శనివారం వేల్పుల గ్రామానికి చేరుకుని ఆయన తల్లి లింగాల పార్వతమ్మను పరామర్శించి ఓదార్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లింగాల రామలింగారెడ్డిని లక్ష్యంగా చేసుకుని దాడికి పాల్పడ్డారన్నారు. అన్ని విధాలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

ఆర్‌ఓ ప్లాంటుకు మరమ్మతులు చేయాలి

పులివెందుల : కనంపల్లె గ్రామానికి చెందిన ప్రజలు తమ గ్రామంలో యూసీఐఎల్ కంపెనీ వారు ఏర్పాటు చేసిన ఆర్‌ఓ ప్లాంటు పనిచేయకపోవడంతో ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారని ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి దృష్టికి తెచ్చారు. స్పందించిన ఎంపీ వెంటనే యూసీఐఎల్ అధికారులకు ఫోన్ చేసి ఆర్‌ఓ ప్లాంటు మరమ్మతులను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని సూచించారు. అలాగే వేంపల్లె మండలం ముతుకూరు గ్రామ ప్రజలు తమ గ్రామంలో ఉన్న మెయిన్ రోడ్డు హెచ్చుతగ్గుల కారణంగా ప్రమాదాలు జరుగుతున్నాయని ఎంపీ దృష్టికి తెచ్చారు. ఆయన సంబంధిత అధికారులకు ఫోన్ చేసి రోడ్డుకు మరమ్మతు పనులు చేయాలని సూచించారు.

ఉక్కు ఫ్యాక్టరీ ఏర్పాటుకు ఉద్యమం చేస్తాం

వేంపల్లె : కడప జిల్లాలో ఉక్కు ఫ్యాక్టరీ ఏర్పాటు సాధనకై ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని సీపీఐ పులివెందుల ఏరియా కార్యదర్శి బ్రహ్మం, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు బల్లారపు రామాంజనేయులు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. శనివారం వేంపల్లె నాలుగు రోడ్ల కూడలి నుంచి భారత కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర మహాసభలకు భవన నిర్మాణ కార్మికులు బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పులివెందుల నియోజకవర్గంలో ఉన్న సమస్యలపై మహాసభలో చర్చించి పని చేస్తామన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు, భవన నిర్మాణ కార్మికులు పాల్గొన్నారు

ప్రొద్దుటూరు, జమ్మలమడుగు ఇన్‌చార్జి ఏజీపీగా శ్రీనివాసులు



కమలాపురం : స్థానిక జూనియర్ సివిల్ కోర్టులో అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ (ఏజీపీ)గా సేవలందిస్తున్న బొలిశెట్టి శ్రీనివాసులును ప్రొద్దుటూరు సీనియర్ సివిల్ కోర్టుకు, అలాగే జమ్మలమడుగు జూనియర్ సివిల్ కోర్టుకు ఇన్‌చార్జి ఏజీపీగా నియమిస్తూ కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రొద్దుటూరు, జమ్మలమడుగు కోర్టులకు శ్రీనివాసులును తాత్కాలిక ఏజీపీగా నియమించినందుకు ఆయన కలెక్టర్‌తో పాటు లా డిపార్ట్‌మెంట్ అధికారులకు కృతజ్ఞతలు తెలియజేశారు. కాగా ఈయన 2007లో కమలాపురం కోర్టులో న్యాయవాదిగా ఎన్‌రోల్ చేసుకున్నారు. 2015 నుంచి 2021 వరకు ఎర్రగుంట్ల మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్‌గా సేవలందించారు. ప్రస్తుతం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్యానల్ అడ్వకేట్‌గాను, ఎల్ఐసీ ప్యానల్ అడ్వకేట్‌గానూ కొనసాగుతున్నారు. కమలాపురం కోర్టు పరిధిలోని ప్రభుత్వ రెవెన్యూ కార్యాలయాలకు సంబంధించిన కేసులను వాదిస్తున్న ఆయనను ప్రసుతం ప్రొద్దుటూరు, జమ్మలమడుగు కోర్టులకు ఇన్‌చార్జి ఏజీపీగా నియమించినందున స్థానిక బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్, సభ్యులు, కోర్టు సిబ్బంది ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు.

ముగిసిన శ్రావణ శనివారాలు

పులివెందుల టౌన్ : శ్రావణ మాస 5వ శనివారం సందర్భంగా అంజన్న ఆలయాలలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రావణమాసం చివరి శనివారం కావడంతో పట్టణంలోని తూర్పు ఆంజనేయస్వామి ఆలయం, పీడబ్ల్యూ కాలనీ, కోతి సమాధి ఆలయం అభయాంజనేయస్వామి ఆలయం, పాత మార్కెట్ పడమటి ఆంజనేయస్వామి, ఆర్అర్ లే అవుట్ అభయాంజనేయస్వామి, అడ్డగుట్ట ఆంజనేయస్వామి ఆలయాలకు భక్తులు అధిక సంఖ్యలో చేరుకుని ఆకు పూజలు నిర్వహించి కాయ, కర్పూరం సమర్పించారు. అలాగే పట్టణ సమీపంలోని డంపింగ్ యార్డు సమీపంలో వెలసిన అభయాంజనేయస్వామికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు హిందు ఐక్య వేదిక ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యంలేకుండా ఉండేందుకు ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంచిపెట్టారు. ఆలయాల్లో అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

సింహాద్రిపురంలో..

సింహాద్రిపురం : స్థానిక శ్రీలక్ష్మీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం శ్రావణమాస శనివార వ్రత పూజలు జరిగాయి. ఆలయ ప్రధాన అర్చకులు హరిప్రసాద్ శర్మ ఆలయంలో స్వామివారికి పంచామృతాభిషేకం, తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు.



సింహాద్రిపురంలో ప్రత్యేక పూజలలో మహిళలు

లింగాలలో..

లింగాల : శ్రావణమాస చివరి శనివారం సందర్భంగా ఆంజనేయస్వామి ఆలయాలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలంలోని లింగాల, వెలిదండ్ల, తాతిరెడ్డిపల్లె, పార్నపల్లె, ఎగువపల్లె తదితర గ్రామాల్లోని ఆంజనేయస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలను అందుకున్నారు. అలాగే వెలిదండ్ల దేవరకోన హరిహర క్షేత్రంలో శనివారం భాగవత పండితులు నలచరిత్ర పఠనం గావించారు. ఈ సందర్భంగా వారు భగవద్గీత పారాయణం, నలచరిత్ర విశిష్టత గురించి తెలియజేశారు. కార్యక్రమంలో భాగవత పండితులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



పులివెందులలోని పడమటి ఆంజనేయస్వామి

చింతకొమ్మదిన్నెలో..

చింతకొమ్మదిన్నె : మండలంలోని ఆంజనేయస్వామి దేవాలయాలలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కొత్తపేట సమీపంలోని గంగమ్మ దేవస్థానం వద్ద ఉన్న ఆంజనేయస్వామి దేవాలయంలో ఉత్సవ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు రామలింగారెడ్డి ఆధ్వర్యంలో భక్తులకు చెక్క భజన కార్యక్రమాలు ఏర్పాటు చేసి భోజనాలు ఏర్పాటు చేశారు.

భవనాల పరిశీలన

పెండ్లిమర్రి : మండల కేంద్రంకు సమీపంలో నూతనంగా రూ.12 కోట్ల నిధులతో నిర్మించిన ఆదర్శ ప్రభుత్వ డిగ్రీ కళాశాల భవనాలను శనివారం కడప ఆర్డీఓ జాన్‌ఇర్విన్ పరిశీలించారు. డిగ్రీ కళాశాల భవన నిర్మాణ పనులు పూర్తి అయ్యాయి. సెప్టెంబర్ 2వ తేదీన విద్యాశాఖ మంత్రి చేతుల మీదుగా ప్రారంభోత్సవ ఏర్పాట్లు చేస్తున్నారు.

ఘన నివాళి

పులివెందుల టౌన్ : పట్టణంలోని స్థానిక ఆహార విజ్ఞాన శాస్త్ర సాంకేతిక కళాశాలలో శనివారం టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి సందర్భంగా కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఎం.మాధవ, ఇతర అధ్యాపకులు, టంగుటూరి ప్రకాశం పంతులు చిత్రపటానికి పుష్ప నివాళులర్పించారు. ఈ సందర్భంగా కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్. ఎ. మాధవ మాట్లాడుతూ టంగుటూరి ప్రకాశం పంతులు నిరుపేద కుటుంబంలో పుట్టినా కూడా ఉన్నతంగా చదువుకున్నారన్నారు. స్వాతంత్రోద్యమ నాయకుల్లో తెలుగువాడైన ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు ఒకరు, సంపాదనంతా ప్రజా సంక్షేమానికే ఖర్చు పెట్టారన్నారు. మరణించే నాటికి ఆయనకంటూ ఆయన సంపాదించిన ధనం ఏమి మిగల్చుకోలేదన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

స్వచ్ఛత హీ సేవా దినోత్సవ ర్యాలీ

లింగాల : వెలిదండ్ల గ్రామంలో ఎంపీపీ రమాదేవి అధ్యక్షతన శనివారం స్వచ్ఛత హీ సేవా ర్యాలీ కార్యక్రమాన్ని నిర్వహించారు. అధికారులు విద్యార్థులతో కలిసి గ్రామంలో ర్యాలీ నిర్వహించి బస్టాండు ఆవరణలో మానవహారంగా ఏర్పడి ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రతతోపాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. దీనివల్ల ఆరోగ్య పరిస్థితులు మెరుగుపడటమే కాకుండా కుటుంబాల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయన్నారు. ఎంపీడీఓ శ్రీనివాసులరెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ భోజనం చేసేముందు చేతులు శుభ్రంగా కడుక్కొని భోజనం చేయాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఇళ్ల ముంగిట మురికి కుంటలను పూడ్చివేసి బ్లీచింగ్ పౌడర్, పిచికారి చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ కిశోర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



వెలిదండ్ల బస్టాండులో ప్రతిజ్ఞ చేస్తున్న ఎంపీపీ రమాదేవి, తదితరులు

రేపు జిల్లాస్థాయి యోగా పోటీలు

వేంపల్లె : పట్టణంలోని స్థానిక శ్లోకా స్కూలులో జిల్లా యోగా అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 25వ తేదీ సోమవారం ఉదయం 9 గంటలకు జిల్లా స్థాయి యోగా పోటీలను నిర్వహిస్తున్నట్లు వైయస్సార్ కడప జిల్లా యోగ అసోసియేషన్ ప్రెసిడెంట్ అనిల్, సెక్రెటరీ తేజలు తెలిపారు. ఎంపిక పోటీలను 18 ఏళ్ల నుంచి 45 ఏళ్లలోపు ఏళ్ల కేటగిరీల వారీగాస్త్రీ, పురుషుల విభాగం, బాల, బాలికల విభాగాలుగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ యోగ పోటీల సిలబస్, గైడ్లెన్స్ కొరకు 6301612190, 9440470064 ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు. ఈ పోటీలలో ప్రతిభ కనబరిచిన వారు సెప్టెంబర్ 6, 7 తేదీలలో ఈస్ట్ గోదావరి జిల్లాలో ద్వారక తిరుమలలో జరిగే 50వ రాష్ట్రస్థాయి యోగా పోటీలలో పాల్గొంటారని తెలిపారు.

అంగన్‌వాడీలకు జీతాలు పెంచాలి

జమ్మలమడుగు : అంగన్‌వాడీల జీతాలను పెంచడంతోపాటు, నిత్యావసరాలు పెంపిణీ చేసే ఎఫ్ఆర్ఎస్ విధానం రద్దుచేయాలని అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు లక్ష్మీదేవి, పట్టణ కార్యదర్శి భాగ్యలక్ష్మీలు తెలిపారు. శనివారం స్థానిక ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో వారు మాట్లాడారు. 2024 జూలైలో వేతనాలు పెంచుతామని చెప్పిన ప్రభుత్వం ఇప్పటి వరకు పెంచలేదన్నారు. ప్రధాన మంత్రి మాతృవందనం పథకంను కొత్తగా అంగన్‌వాడీలకు అప్పగించరాదన్నారు. వేతనాలు పెంచేవిధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం ఇన్‌చార్జి సీడీపీఓ సైరాభానుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షురాలు లక్ష్మీదేవి, సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.

దోమల నియంత్రణ మనందరి బాధ్యత

సింహాద్రిపురం : దోమల నియంత్రణ మనందరి బాధ్యత అని మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ సిద్దయ్య తెలిపారు. శనివారం మండలంలోని బిదినంచర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని గురిజాల గ్రామంలో దోమకాటువల్ల వచ్చే వ్యాధుల గురించి నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ఆరోగ్య కార్యకర్తలు ప్రతి గ్రామాన్ని సందర్శించి జ్వరం ఉన్న వారికి రక్త పూతలు సేకరించి వారానికి రెండుసార్లు ల్యాబ్‌కు అందజేయాలన్నారు. ఎవరికైనా మలేరియా నిర్ధారణ అయితే వెంటనే చికిత్స అందించి మలేరియా వచ్చిన వ్యక్తి గ్రామంలో ఫీవర్ సర్వే, లార్వా సర్వే చేసి గ్రామ ప్రజలందరికీ రక్తపరీక్షలు చేయాలన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి సుకుమార్, పీహెచ్ఎన్.పద్మావతి, హెల్త్ సూపర్‌వైజర్ లక్ష్మీదేవి, ఆరోగ్య కార్యకర్త రమాదేవి, సీహెచ్ఓ లీలా, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



దోమల నివారణపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న సిద్దయ్య

సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి

జమ్మలమడుగు : వినాయక విగ్రహాల మండపాల వద్ద నిర్వాహకులు కచ్చితంగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని అర్బన్ సీఐ నరేష్‌బాబు తెలిపారు. శనివారం స్థానిక తన కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ నిర్వాహకులు ఆన్‌లైన్‌లో మాత్రమే దరఖాస్తులు చేసుకోవాలని దరఖాస్తులు చేసుకున్న వారికి క్యూ ఆర్ కోడ్ ఇవ్వడం జరుగుతుందన్నారు. మండపాల వద్ద మైక్ పర్మిషన్ కోసం ఎటువంటి చలానాలు కట్టవలసిన అవసరంలేదన్నారు. మండపాల వద్ద ప్రతిరోజు రాత్రి కనీసం ఐదు మంది ఉండాలన్నారు.

1098 నంబర్‌పై అవగాహన కలిగి ఉండాలి

పెండ్లిమర్రి : విద్యార్థినులు ప్రతి ఒక్కరు చైల్డ్ హెల్ప్ లైన్ నంబర్ 1098పై అవగాహన కలిగి ఉండాలని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల ఎస్ఓ సరస్వతి, ఐసీడీఎస్ సూపర్ వైజర్ కల్పనలు అన్నారు. శనివారం పెండ్లిమర్రి కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో విద్యార్థినులకు చైల్డ్ హెల్ప్ లైన్ నంబర్ 1098పై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాల్య వివాహాలు, బాలకార్మికులు, మైనర్లకు లైంగిక వేధింపులు, పిల్లలను ఇతర రకాల వేధింపులకు గురిచేస్తే 1098 హెల్ప్ లైన్ నంబర్‌కు కాల్ చేసి ఫిర్యాదు చేయవచ్చన్నారు. మీకు వచ్చే సమస్యల ను సమర్థవతంగా ధైర్యంగా ఎదుర్కొవాలని సూ చించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్ వైజ ర్లు, విద్యార్థినులు పాల్గొన్నారు.

చింతకొమ్మదిన్నెలో..

చింతకొమ్మదిన్నె : కొలుములపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చైల్డ్ హెల్ప్ లైన్ నెంబర్ 1098పై ఐసీడీఎస్ అధికారులు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. వారు మాట్లాడుతూ పిల్లలకు ఏదైనా సమస్యలు ఎదురైనప్పుడు 1098కు ఉచితంగా కాల్ చేయవచ్చునని తెలిపారు ఎవరైనా పిల్లల్ని టీజ్ చేస్తున్నా, లేదా అసభ్యతకు పాల్పడినా 1098 నెంబర్‌కు కాల్ చేసి చెప్పవచ్చునన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెడ్మాస్టర్ రమాదేవి, ఐసీడీఎస్ సూపర్వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



చైల్డ్ హెల్ప్ లైన్ నంబర్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఐసీడీఎస్ సూపర్ వైజర్లు

మానవత్వాన్ని మేల్కొల్పడమే మానవత ధ్యేయం

పులివెందుల టౌన్ : మానవత్వాన్ని మేల్కొల్పడమే మానవత సంస్థ ధ్యేయమని మానవత స్వచ్ఛంద సేవా సంస్థ చైర్మన్ డి.వి.కొండారెడ్డి తెలిపారు. శనివారం పట్టణంలోని స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో «విద్యార్థులు-నైతిక విలువలు» అనే అంశంపై ఉపన్యాస పోటీలు నిర్వహించారు. క్రమ శిక్షణలేని జీవితం వ్యర్థమని, విద్యార్థులు నైతిక విలువలు పాటిస్తూ ప్రగతి పథంలో నడవాలన్నారు. పాఠశాల హెడ్మాస్టర్ గంగిరెడ్డి మాట్లాడుతూ మానవత్వం గురించి ఉదాహరణలతో వివరించారు. అనంతరం ఉపన్యాస పోటీ విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో మానవత స్వచ్ఛంద సేవా సంస్థ కోశాధికారి శేషయ్య, కార్యవర్గ సభ్యులు రాజేశ్వర రెడ్డి, సోమశేఖరరెడ్డి, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

సమతుల ఆహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

ముద్దనూరు : గర్భిణులు, బాలింతలు సమతుల ఆహారం తీసుకోవడంవల్ల తల్లీ బిడ్డ ఇరువురు సంపూర్ణ ఆరోగ్యంతో వుంటారని ఐసీడీపీ సీడీపీవో కొండమ్మ తెలిపారు. శనివారం స్వచ్ఛ ఆంధ్ర, ఈసీసీఈ కార్యక్రమాల్లో భాగంగా ఆమె సిబ్బందితో కలిసి స్థానిక ఎస్సీ-2 అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా సీడీపీవో మాట్లాడుతూ నిత్యం పౌష్టికాహారాన్ని తీసుకోవాలని, పరిశుభ్రంగా వుండే వాతావరణంలో ఆహారపదార్థాలు వుండేలా జాగ్రత్త పాటించాలన్నారు. ఆమె సిబ్బందితో కలిసి స్వచ్ఛ ఆంధ్ర, పరిసరాల పరిశుభ్రతపై ప్రతిజ్ఞ చేశారు. స్థానిక ఎంపీడీవో పరపూర్ణ అరుంధతి ఆధ్వర్యంలో పరిసరాల పరిశుభ్రతపై ర్యాలీ నిర్వహించారు. పంచాయతీ, సచివాలయ సిబ్బంది మానవహారంగా ఏర్పడ్డారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో వీరభద్రుడు, ఈవో లక్ష్మీనరసింహులు, ఏపీవో గంగయ్య, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విశాలాక్షి తదితరులు పాల్గొన్నారు.



అంగన్‌వాడీ కేంద్రంలో మాట్లాడుతున్న సీడీపీవో

కృత్రిమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవు

కమలాపురం : ఎరువుల కృత్రిమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవు అని ఏడీఏ నరసింహారెడ్డి తెలిపారు. శనివారం ఆయన పట్టణంలోని పలు ఎరువుల దుకాణాలను సీఐ ఎస్‌కే రోషన్, ఎస్ఐ విద్యాసాగర్, విజిలెన్స్ అధికారి సుధాకర్‌తో కలసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టాక్ రిజిష్టర్లు, బిల్లు బుక్స్ పరిశీలించారు. స్టాక్ రిజిష్టర్లకు, నిల్వకు సరిపోక పోతే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎరువులు అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరకే ఎరువులను రైతులకు విక్రయించాలన్నారు. రైతులు సైతం బిల్లులు తప్పని సరిగా తీసుకోవాలన్నారు. కమలాపురం మండలంలో ఇప్పటి వరకు 291 టన్నులు యూరియా పంపిణీ చేశామన్నారు. ఇప్పటి వరకు ఎటువంటి కొరత రాలేదని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. డీలర్లు కృత్రిమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. ఏఓ సరస్వతి మాట్లాడుతూ నానో యూరియా అందుబాటులో ఉందని, పంటలకు పైపాటుగా పురుగు మందులతో కలిపి పిచికారి చేసుకోవాలన్నారు. ఆర్‌ఎస్‌కేలలో, ప్రైవేట్ డీలర్ల వద్ద యూరియా అవసరం మేరకు పంపిణీ చేస్తామని ఆమె వివరించారు.



ఎరువుల దుకాణాలను పరిశీలిస్తున్న వ్యవసాయ, పోలీస్ అధికారులు

పలుకుబడి ఉన్న వారికే ఎరువులా

సాధారణ రైతులకు ఎరువులు ఎక్కడ అందుతున్నాయని, పలుకుబడి ఉన్నవారికే ఎరువులు ఇస్తున్నారని రైతులు ఏఓ, ఏడీఏలను నిలదీశారు. ఎరువుల దుకాణాలను పరిశీలించడానికి వచ్చిన వ్యవసాయ అధికారులను సాధారణ రైతులు యూరియా దొరక్క అవస్థలు పడుతున్నారని, పలుకుబడి ఉన్న వారికే యూరియా పంపిణీ చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

గండి అంజన్న సేవలో ట్రిపుల్‌ఐటీ విద్యార్థులు

వేంపల్లె : గండి శ్రీవీరాంజనేయస్వామి సన్నిధిలో ఇడుపులపాయ ఆర్కేవ్యాలీ ట్రిపుల్‌ఐటీ విద్యార్థులు శనివారం ఆయా సేవా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. గండికి వచ్చే భక్తుల కొరకు వీరన్నగట్టుపల్లి క్రాస్ వద్ద నుంచి గండి క్షేత్రం వరకు బస్సు సౌకర్యం ఏర్పాటు చేశారు. ట్రిపుల్‌ఐటీకి చెందిన ఎన్ఎస్ఎస్ యూనిట్ విద్యార్థులు కూడా హాజరై క్యూలైన్లలో శ్రద్ధగా మార్గనిర్దేశం చేశారు. భక్తులకు తాగునీరు అందించడంతోపాటు భక్తులకు వైద్య సహాయం అందించారు. ఎవరికి తోచిన విధంగా దాతలు రోడ్డు వెంబడి అన్నదానాలు, పండ్ల పంపిణీ లాంటి కార్యక్రమాలు చేపట్టారు. చివరి వారం అమావాస్యం కావడంతో ఉదయం కొద్దిగా భక్తుల రద్దీ తక్కువ అయినప్పటికీ మధ్యాహ్నం నుంచి భక్తుల రద్దీ భారీగా పెరిగింది.

పాత పెన్షన్లను తొలగించడం దారుణం

వల్లూరు(చెన్నూరు) : కూటమి ప్రభుత్వ 14 నెలల కాలంలో రాష్ట్రంలో దాదాపు నాలుగున్నర లక్షల పెన్షన్లు తొలగించారని, 15 సంవత్సరాల నుండి పెన్షన్ తీసుకుంటున్న వారిని కూడా తొలగించడం దారుణమని వైఎస్ఆర్‌సీపీ రాష్ట్ర పంచాయతీ రాజ్ విభాగం ప్రధాన కార్యదర్శి చీర్ల సురేష్ యాదవ్ అన్నారు. చెన్నూరులో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఏర్పడితే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు 50 సంవత్సరాల వయసుకే పెన్షన్ ఇస్తామని హామీ ఇచ్చారని, అధికారంలోకి వచ్చాక ఆ హామీని గాలికి వదిలేశారన్నారు. కూటమి పాలనలో కొత్త పెన్షన్ల మాట దేవుడెరుగు ఉన్న పెన్షన్లు ఊడగొట్టడం జరిగిందని ప్రభుత్వ తీరుపై మండిపడ్డారు. సెప్టెంబర్ 1వ తేదీ నాటికి అర్హులైన వారికి పెన్షన్లు అందేటట్లు చూడాలని ఆయన డిమాండ్ చేశారు. ఒక్క చెన్నూరు మండలంలోనే దాదాపు 120 మంది దివ్యాంగుల పెన్షన్లు తొలగించడం జరిగిందన్నారు. గత ప్రభుత్వంలో ఇంటింటికి వెళ్లి పారదర్శకంగా పెన్షన్లు అందించిన ఘనత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీదేనన్నారు.ఇప్పటికైనా ప్రభుత్వం దివ్యాంగులపై కక్ష సాధింపు చర్యలు మానుకుని వారికి పెన్షన్ ఇచ్చే విధంగా చర్యలు చేపట్టాలన్నారు.

విగ్రహాల ఏర్పాటుకు అనుమతి తప్పనిసరి

కొండాపురం : గ్రామాల్లో వినాయక విగ్రహాల ఎర్పాటుకు పోలీసుల అనుమతి తీసుకోవాలని ఎస్ఐ ప్రతాప్‌రెడ్డి తెలిపారు. కొండాపురం పోలీస్‌స్టేషన్ అవరణలో శనివారం మండల తహసీల్దార్, మండల పరిషత్ అధికారి, విద్యుత్ శాఖ అధికారులతో ఆయన ఉత్సవాల సమన్వయ సమావేశం నిర్వహించారు. విగ్రహాలు చేర్పాటు చేసే కమిటీ సభ్యులు తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలన్నారు. ఏరోజు నిమజ్జనం చేస్తున్నారనే విషయాలను పోలీసులకు సమచారం ఇవ్వాలన్నారు.

స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలు వెలకట్టలేనివి

వేంపల్లె : దేశ స్వాతంత్ర్యం కోసం తమ సర్వస్వాన్ని త్యాగం చేసిన సమరయోధుల త్యాగాలు వెలకట్టలేనివని పాఠశాల కరస్పాండెంట్ బిఎస్ రమణారెడ్డి తెలిపారు. శనివారం వేంపల్లెలోని స్థానిక ఉషాకిరణ్ ఉన్నత పాఠశాలలో కరస్పాండెంట్ బీఎస్ రమణారెడ్డి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి టంగుటూరు ప్రకాశం పంతులు జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. మహాత్మా గాంధీ నాయకత్వంలో జరిగిన స్వాతంత్ర్య పోరాటంలో ఆంధ్రప్రదేశ్ నుంచి ప్రకాశం పంతులు ప్రముఖ పాత్ర వహించారన్నారు. పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి

పులివెందుల టౌన్ : ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రతతోపాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని మున్సిపల్ వైస్ చైర్మన్ హాఫీజ్ తెలిపారు. శనివారం స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ కమిషనర్ రాముడు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన హాజరై ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకున్నప్పుడే ఎలాంటి రోగాలు దరిచేరవన్నారు. దోమలు వృద్ధి చెందకుండా ప్రతి ఒక్కరూ శుభ్రత పాటించాలి. ఈ ర్యాలీ పులివెందుల పట్టణంలో పూలంగళ్ల సర్కిల్, మెయిన్ బజార్ మీదుగా నిర్వహించారు. అనంతరం వీరితోపాటు కో ఆప్షన్ మెంబర్ చంద్రమౌళి, స్నేహిత అమృతహస్తం సేవా సమితి అధ్యక్షుడు రాజు, కౌన్సిలర్లు, మహిళలు చీపుర్లు పట్టుకుని మున్సిపల్ కార్యాలయ ఆవరణలో శుభ్ర పరిచారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



ర్యాలీలో మున్సిపల్ వైస్ చైర్మన్, తదితరులు

25న రక్తదాన శిబిరం

జమ్మలమడుగు : ఈనెల 25వ తేదీ ఓంశాంతి ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు ఈశ్వరి బ్రహ్మకుమారి సమాజం సభ్యురాలు ఉమా తెలిపారు. దేశ వ్యాప్తంగా లక్ష యూనిట్‌ల రక్తం సేకరించాలనే లక్ష్యంతో భాగంగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశామన్నారు. సోమవారం పట్టణంలోని ముద్దనూరు రహదారిలో శ్రీనివాస డిగ్రీకాలేజీలో రక్తదానం కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఉద్యోగులు, యువత రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. తహసీల్దార్ శ్రీనివాసులరెడ్డి మాట్లాడుతూ రక్తదానం చేయడం వల్ల నిండు జీవితంతోపాటు కుటుంబాన్ని కూడా ఆదుకున్నవారు అవుతారన్నారు.

బోద కొట్టం అగ్నికి ఆహుతి

చింతకొమ్మదిన్నె : మండలంలోని గోపాలాపురం గ్రామంలో పాలెం వెంకటమ్మకు చెందిన బోద కొట్టం శనివారం అగ్ని ప్రమాదం జరిగి పూర్తిగా కాలిపోయింది. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలు వ్యాపించకుండా ఆర్పివేశారు. ఈ ప్రమాదంలో ఇంట్లోని దుస్తులు, బీరువాలు, సామగ్రి కాలిపోవడంతో సుమారు 3 లక్షల రూపాయలు పైగా నష్టం జరిగినట్లు సమాచారం.

గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోండి

కొండాపురం : గ్రామాల్లో ప్రతి ఒక్కరు ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీఓ నాగప్రసాద్ తెలిపారు. శనివారం స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా వైద్య శాఖ అధికారులు, విద్యార్థులతో ఆయన పరిశుభ్రతపై ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, విద్యార్థులు ఎంఈఓ-2, రామయ్య తదితరులు పాల్గొన్నారు.

